సాక్షి
సిద్దిపేట
గురువారం । 19 । జనవరి । 2023



శనగకు పచ్చపురుగు బెడద

యాసంగిలో విస్తారంగా సాగైన శనగ పంటను పచ్చ పురుగు, రబ్బరు పురుగు ఆశించింది. ఇది రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. 8లో..

టీచర్ వక్రబుద్ధి



పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి సక్రమమార్గంలో పెట్టాల్సిన ఓ ఉపాధ్యాయుడు వక్రబుద్ధి చూపాడు. మహిళా టీచర్‌తో అసభ్యంగా ప్రవర్తించి సస్పెండ్ అయ్యాడు. ఇంతలోనే మరో దొంగతనం కేసు నమోదైంది. 8లో..



విజయవంతం చేయాలి

నేడు జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. 9లో..

క్రమబద్ధీకరణ సగమే!

- 59 జీఓ కింద 4,083 దరఖాస్తులు
- క్షేత్ర స్థాయిలో అధికారుల సర్వే పూర్తి
- 1,656 మందికి డిమాండ్ నోటీసులు
- మిగతావారికి అందని సమాచారం
- అయోమయంలో దరఖాస్తుదారులు

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణకు కసరత్తు ప్రారంభమైంది. దీని కోసం 2014లో ప్రభుత్వం జీవో 58, 59 జారీ చేసిన విషయం తెలిసిందే. గతంలో అవగాహన లేక చాలామంది పేదలు దరఖాస్తు చేసుకోలేదు. అలాంటివారి కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించి గతేడాది మార్చి 31 వరకు దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 4,083 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని సెప్టెంబర్ వరకు జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. వీటిలో ఇళ్ల క్రమబద్ధీకరణకు సగం మందికి ఆమోదం తెలిపి మిగతా వాటిని పెండింగ్‌లో ఉంచారు. దీంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన మొదలైంది.

సర్వే బృందాల పరిశీలన

- వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు 14 టీంలను ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో సర్వే చేయించారు. ఇంటి స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లులు తదితరాలను పరిశీలించి అర్హులను గుర్తించారు.
- జిల్లా వ్యాప్తంగా 4,083 దరఖాస్తులు రాగా అందులో 2,151 ఆమోదం పొందాయి. అందులో 1,656 మందికి డిమాండ్ నోటీసులను జారీ చేశారు. అలాగే 197 దరఖాస్తులు రిజక్ట్, మరో 299 దరఖాస్తులు ఆమోదానికి పెండింగ్‌లో ఉండగా 1,931 దరఖాస్తులు సీసీఎల్‌లో పెండింగ్‌లో ఉన్నాయి.



హుస్నాబాద్‌లో సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

- సర్వే బృందాలు ఇచ్చిన నివేదిక ప్రకారం దరఖాస్తులను కలెక్టర్ మరోసారి పరిశీలించారు. అనంతరం అర్హుల జాబితాను ఆమోదించి ప్రభుత్వానికి పంపించారు. ఇందులో సర్వే నంబర్, ఏరియా ఆధారంగా సంబంధిత స్థలానికి సంబంధించిన మార్కెట్ విలువను వేసి పంపారు.
- ఇటీవల ప్రభుత్వం ఆమోదముద్ర వేయడంతో దరఖాస్తుదారులకు రెవెన్యూ సిబ్బంది డిమాండ్ నోటీసులు పంపుతున్నారు. అలాగే సెల్‌ఫోన్లకు మెసేజ్ కూడా పంపుతున్నారు.
- డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో మూడు విడతలుగా క్రమబద్ధీకరణకు డబ్బులు చెల్లించాలని సూచిస్తున్నారు.

అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

- మొత్తం 4,083 మంది దరఖాస్తు చేయగా ఇప్పటి వరకు కేవలం 1,656 మందికే డిమాండ్ నోటీసులకు సంబంధించిన సమాచారం అందింది. మిగతా 2,427 దరఖాస్తు దారులకు ఎలాంటి సమాచారం రాకపోవడంతో ఆయోమయం చెందుతున్నారు. డిమాండ్ నోటీసులు జారీ అయిన వారికే చెల్లించాల్సిన వారికే వస్తుండటంతో తమకెప్పుడు వస్తుందో అని అధికారుల చుట్టు దరఖాస్తుదారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. డబ్బులు చెల్లించేందుకు డిమాండ్ నోటీస్ ఎప్పుడు వస్తుందో అని ఎదురు చూస్తున్నారు.
- మార్కెట్ విలువ కంటే ఎక్కువ ధరతో కొందరికి డిమాండ్ నోటీసులు రావడంతో ఆందోళన చెందుతున్నారు. అదే పట్టా భూమి తక్కువ ధరకు విక్రయించే చోట సైతం రెండు మూడు అంతలు ఎక్కువగా విధించారు. దీంతో డిమాండ్ నోటీసులు అందుకున్న వారు ఆందోళన చెందుతున్నారు.

ఎలాంటి సమాచారం లేదు..



నేను ఆటో డ్రైవర్‌ను. 2012లో ఇంటి స్థలం తీసుకున్న. 59 జీవో కింద క్రమబద్ధీకరణకు 5 నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నాను. మూడు నెలల క్రితం అధికారులు వచ్చి సర్వే చేశారు. మాతోపాటు సర్వే నిర్వహించిన కొందరికీ రెవెన్యూ అధికారుల నుంచి మెసేజ్‌లు వచ్చాయి. కానీ మాకు ఇంతవరకు ఎలాంటి సమాచారం అంద లేదు.

–గొల్లెం తిమోతీ, ఆదర్శనగర్, సిద్దిపేట

రూ.10.18 లక్షలు చెల్లించాలని నోటీస్

- సిద్దిపేట పట్టణ శివారులోని ఓ వ్యక్తి తన 249 గజాల స్థలం క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నాడు. అక్కడ మార్కెట్ విలువ కంటే ఎక్కువ వేసి రూ.10.18 లక్షలు చెల్లించాలని డిమాండ్ నోటీస్ జారీ చేశారు. అంత కంటే తక్కువ ధరకే పక్కనే పట్టా భూమి లభిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు విన్నవించిన ఎడిట్ ఆప్షన్ లేదని సమాధానం చెప్పడం గమనార్హం. ఈ డబ్బులను మూడు విడతల్లో చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. భూమి మార్కెట్ విలువ కంటే ఎక్కువ విధించడంతో సదరు దరఖాస్తుదారుడి దగ్గర అంత పెద్ద మొత్తంలో డబ్బులు లేకపోవడంతో మొదటి దఫా చెల్లించని పరిస్థితి.

న్యూస్‌రీల్

పట్టాలు ఇచ్చిన వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ గ్రామంలో 1999లో సర్వే నంబర్ 213ఏ లో ఇళ్ల లేని నిరుపేదలకు ఆనాటి ప్రభుత్వం 2.20 ఎకరాల భూమిని ప్లాట్లుగా చేసి పట్టాలు ఇచ్చిన భూములను వెంటనే వారికి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గతంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాను ఆక్రమించుకోని పట్టా చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాలు పొందిన నిరుపేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో దాసరి కళావతి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, రాళ్లబండి శశిధర్, సర్పంచులు రమణారెడ్డి, రవీందర్ తేలు ఇస్తారి, సనాది భాస్కర్, ఉల్లంపల్లి సాయిలు, ప్రమీల, నర్సవ్వ పాల్గొన్నారు.

21 నుంచి ఉర్సే షరీఫ్ ఉత్సవాలు



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉర్సే షరీఫ్ దర్గా ఆశ్రమ పీఠం ఉత్సవాలు 21వ తేదీ నుంచి 23 వరకు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి ఖాజా మహ్మద్ హకీం షరీఫ్ చిష్తి తెలిపారు. బుధవారం ముర్షద్ గడ్డ దర్గా ఆశ్రమ పీఠంలో ఉత్సవాలకు సంబంధించిన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగ చిష్తియా పీఠం నిలుస్తుందన్నారు. ఉర్సే షరీఫ్ ఉత్సవాలను విజయవంతం చేయలని భక్తులను కోరారు. 21న గంధారధన, 22న దీపారధన, 23న ఖవ్వాలి, ఖురాన్ పఠన కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాబెర్ షరీఫ్ చిష్తి, ఫైజుద్దిన్ చిష్తి, అఫ్జలుద్దిన్ చిష్తి, నాయబ్ రెడ్డి చిష్తి, ప్రభుదాస్ చిష్తి, మల్లం రాజు చిష్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలీస్ యాక్ట్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేటి నుంచి పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ ఎన్.శ్వేత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాక్ట్ జనవరి 26వ తేదీ ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటుందన్నారు. ఈ సమయంలో ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. వీటి నిర్వహణకు ముందస్తుగా పోలీసు అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలన్నారు. అలాగే జనవరి 26వ తేదీ వరకు డీజే సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కొనసాగుతాయన్నారు.

అందుబాటులో ఆయిల్‌పామ్ మొక్కలు

జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న శివప్రసాద్

దుబ్బాకటౌన్: జిల్లా వ్యాప్తంగా ఆరువేల ఎకరాలకు సరిపడ ఆయిల్‌పామ్ మొక్కలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలోని రైతు వేదికలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సహాయంతో గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి పామాయిల్ తోటల సాగును ప్రోత్సహించేలా అధికారులు కృషి చేయాలన్నారు. మొక్కలు అందుబాటులో ఉండడంతో త్వరగా డ్రిప్ సర్వే నిర్వహించి రైతులచేత డీడీ కట్టించాలన్నారు. పంటలను ఎప్పటికప్పుడు సందర్శిస్తూ రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించాలన్నారు. అనంతరం 18 ఎకరాల్లో రైతులు గట్టు సంజీవ్, బండుగుల ప్రకాశ్ సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలను సందర్శించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్యాంసుందర్, ఏఓలు ప్రవీణ్‌కుమార్, మోహన్, గోవింద్, ఏఈఓ పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో స్టాండింగ్ కమిటీ సమావేశాలు

సిద్దిపేటజోన్: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు 20, 21 తేదీల్లో జరగనున్నట్లు జెడ్పీ సీఈఓ రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అధ్యక్షతన 2వ, 3వ, 4వ స్థాయీ సంఘం సమావేశాలు జెడ్పీ కార్యాలయంలో జరుగుతాయన్నారు. 20న వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం అంశాలు, 21న శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ, ఆర్థిక, ప్రణాళిక అంశాల్లో సమావేశాలు ఉంటాయన్నారు. సంబంధిత కమిటీ సభ్యులు సకాలంలో హాజరుకావాలని ఆయన సూచించారు.

'సమస్యల పరిష్కారంలో ముందుండాలి'

హుస్నాబాద్‌రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో పంచాయతీ కార్యదర్శులు ముందుడాలని, నిత్యం గ్రామాలకు వెళ్లి బాధ్యతగా విధులు నిర్వహిస్తే పాలనపై పట్టు వస్తుందని డీపీఓ దేవకీదేవి సూచించారు. బుధవారం భల్లునాయక్‌తండాలోని నర్సరీ పనులను ఆమె పరిశీలించి అనంతరం నేడు ప్రారంభించే కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కార్యదర్శులు ముందుడాలన్నారు. వంద శాతం కంటి పరీక్షలు చేయించి ప్రథమ స్థానంలో నిలువడానికి కార్యదర్శులు, సర్పంచ్‌లు కృషి చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీఓ సత్యనారాయణ, వైద్య సిబ్బంది తదితరులున్నారు.



కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవకీదేవి

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న ముజామ్మిల్‌ఖాన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు అందిస్తున్న పథకాల గూర్చి అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జంతు సంక్షేమ సంస్థ ప్రచురించిన కర పత్రాన్ని అందరూ విధిగా చదువాలన్నారు. వెటర్నరీ ఆస్పత్రి ప్రాంతంలోని పౌల్ట్రీ, గొర్రెల, పందులు, డెయిరీఫాం వివరాలను తప్పనిసరిగా సేకరించాలన్నారు. పాడి రైతులకు రోజువారీగా మార్కెటింగ్ వివరాలను అందించాలన్నారు. జిల్లాలో రోజువారిగా పాల ఉత్పత్తులు పెంపు కోసం తీసుకునే జాగ్రత్తలు, మెలకువలు తెలుపాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి పథకాలు ప్రకటించినా రైతులకు వివరించాలన్నారు. పశు సంక్షేమ పక్షోత్సవ అవగాహన కార్యక్రమం జిల్లాలో జనవరి 15 నుంచి 30 వరకు జరుగుతుందన్నారు. అంతకుముందు రాష్ట్ర జంతు సంక్షేమ సంస్థ హైదరాబాద్ వారు జారీ చేసిన కర పత్రాన్ని అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ జగత్ కూమార్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, సహాయ సంచాలకులు డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'గజ్వేల్'లో సీసీ రోడ్లకు రూ.13.25 కోట్లు



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: గజ్వేల్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.13.25 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మెరుగైన వసతుల కల్పనే కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకుసాగుతున్నదని చెప్పారు. వర్గల్ మండలానికి రూ.2.95 కోట్లు, ములుగు మండలానికి రూ.2.30 కోట్లు, మర్కూక్ రూ.1.50కోట్లు, జగదేవ్‌పూర్ రూ.2.45 కోట్లు, గజ్వేల్ రూ.2.35 కోట్లు, కొండపాక, కుకునూర్‌పల్లి మండలాలకు రూ.1.70 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ నిధులతో త్వరలోనే గ్రామాల్లో పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు.

'కంటి వెలుగు' నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులతో మాట్లాడుతున్న డాక్టర్ కాశీనాథ్

జిల్లా వైద్యాధికారి డాక్టర్ కాశీనాథ్

దుబ్బాకటౌన్: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కాశీనాథ్ అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలోని నిర్మిస్తున్న బస్తీ దవఖాన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తప్పనిసరిగా తమ గ్రామాల్లో, పట్టణాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లోకి వెళ్లి కంటి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. పరీక్షలు చేసి అవసరమైన మందులు, కంటి అద్దాలు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. నేటి నుంచి జిల్లాలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా కేంద్రాల వద్ద వైద్య సిబ్బందితో పాటు అన్ని సౌకర్యాలు సమకూర్చడం జరిగిందన్నారు. దుబ్బాక పట్టణంలో త్వరలోనే బస్తీ దవఖాన ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ భార్గవి ఉన్నారు.

'గౌరవెల్లి'ని అడ్డుకుంటున్నది రాష్ట్ర ప్రభుత్వమే



మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుమారుగా 40 ప్రాజెక్టులు నిర్మించిన ఘనత కాంగ్రెస్‌దని, కానీ నేడు రాష్ట్రంలో ప్రాజెక్టులు పూర్తి కాకుండా అడ్డుకుంటుంది బీఆర్ఎస్ పార్టీ అని కాంగ్రెస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పార్లమెంట్ సభ్యుడు పొన్నం ప్రభాకర్, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం అక్కన్నపేట మండలం గుడాటిపల్లి వద్ద నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టు గుడాటిపల్లి వద్ద ఏర్పాటు చేసిన దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్వాసితుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా ప్రాజెక్టు పనులకు బీఆర్ఎస్ ప్రభుత్వమే అడ్డుపడుతుందన్నారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఇచ్చిన హామీ ప్రకారం సుమారు 1,500 మంది భూ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 18 ఏళ్లు నిండిన యువకులకు రూ.8లక్షల పరిహారం చెల్లించాలన్నారు. పెళ్లయిన యువతులకు కూడా రూ.8 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో లింగమూర్తి, ఐలయ్య, శివయ్య, సంజీవ్‌రెడ్డి, దాము, మహేందర్‌రెడ్డి, బస్వరాజ్ శంకర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్నాగం పటాపంచలు

బెడిసికొట్టిన ధర్మానాయక్ వ్యూహం



అక్క సుందతో ధర్మానాయక్- నీల దంపతులు

టేక్మాల్(మెదక్): ప్రభుత్వ ఉద్యోగి అయినా.. అధికంగా డబ్బు సంపాదించాలనే అత్యాశ ధర్మానాయక్‌ది. మొదట్లో షేర్, స్టాక్ మార్కెట్‌లో లాభాలు వచ్చాయి. కరోనా, ఉక్రెయిన్ వార్ కారణంగా నష్టాల పాలయ్యాడు. చిట్టీలు వేస్తూ కొంత డబ్బు కూడబెట్టి మళ్లీ షేర్‌లలో పెట్టినా వచ్చిన డబ్బుతో అప్పులు తీరలేదు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లోనూ నష్టాలు వచ్చాయి. దీంతో అప్పుల నుంచి బయటపడేందుకు ఎల్ఐసీ పాలసీ ప్లాన్ వేశాడు. అయితే పన్నిన పన్నాగం పటాపంచలైంది. ఆయనతోపాటు కుటుంబ సభ్యులను కూడా కటకటాలపాలయ్యేలా చేసింది. అప్పు నుంచి తప్పించుకోవడానికి బీమా పాలసీ చేయడం, దానికి క్లెయిమ్ చేయడానికి ఒకరిని హతమార్చే విషయమై ముందుగానే కుటుంబ సభ్యులతో చర్చించాడు. మూడు నెలల ముందే అనేక వ్యూహాలు పన్నాడు. తన పథక రచన సజావుగా సాగేందుకు సోదరి, ఆమె కుమారుడిని, భార్యను కూడా ఇందులో ఇన్‌వాల్వ్ చేశాడు. ఘటనాస్థలిలో చనిపోయిన వ్యక్తి ధర్మానాయక్ కాదన్న అనుమానంతో పోలీసులు కుటుంబ సభ్యులపై పెట్టిన నిఘా కారణంగా వారంలోనే కేసును పోలీసులు ఛేదించారు. ధర్మా చేసిన తప్పులో ఆయన భార్య నీల, సోదరి సుంద, మేనల్లుడు శ్రీనివాస్‌లు పాలుపంచుకున్నట్లు విచారణలో తేలింది. ధర్మానాయక్‌కు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు అఖిల, చిన్న కూతురు సుస్మిత ఐఐటీలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. కొడుకు రాహుల్ కూకట్‌పల్లిలో ఇంటర్ చదువుతున్నాడు. ధర్మానాయక్ చేసిన తప్పునకు పిల్లల చదువులు ఆగమయ్యే పరిస్థితి దాపురించిందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జరిగిన ఘటనతో ధర్మానాయక్ తండ్రి దుర్గానాయక్ ఈ వృద్ధాప్యంలో కుంగిపోతున్నాడు.

30 రోజుల్లో 145 మందికి డయాలసిస్

- ఉచితంగా హుస్నాబాద్ ఆస్పత్రిలో చికిత్స
- టిఫిన్‌తో పాటు భోజనం అందిస్తున్న సిబ్బంది
- బాధితులకు తగ్గిన దూరాభారం, ఆర్థిక భారం
- క్రమంగా పెరగుతున్న రోగుల సంఖ్య



హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న బాధితులు

హుస్నాబాద్: కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సెంటర్ వరంగా మారింది. నయాపైసా ఖర్చు లేకుండా ఉచితంగ చికిత్స అందిస్తున్నారు. దూర ప్రాంతాలకు పరుగులు తీసే పని లేకుండా స్థానికంగానే డయాలసిస్ చేయించుకునే అవకాశం ఉంది. హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం ద్వారా విజయవంతంగా సేవలు అందిస్తున్నారు. ప్రారంభించిన 30 రోజుల్లోనే 145 మంది బాధితులకు డయాలసిస్ చేయడం విశేషం. ప్రస్తుతం మరో 10 మందికి నిత్యం చికిత్సను అందిస్తున్నారు. అలాగే మరో 20 కేసులు సిద్ధంగా ఉన్నాయి. ప్రైవేట్‌గా డయాలసిస్ చేయించుకుంటే ఒకసారికి సుమారుగా రూ.5 వేల ఖర్చు అవుతుంది.

ఉచిత భోజనం..

ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ సెంటర్లు లేక వ్యాధిగ్రస్తులు అనేక అవస్థలు పడ్డారు. ఈ సేవలకు పట్టణాలు, నగరాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఉండేది. సమయానికి వైద్యం అందక అనేక మంది ప్రాణాలు విడిచిన దాఖలాలున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ కృషి ఫలితంగా స్థానికంగానే డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో బాధితులకు ఉచితంగాన ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. దీంతో కరీంనగర్, వరంగల్, సిద్దిపేట జిల్లాల నుంచి హుస్నాబాద్ ఆస్పత్రికి వస్తున్న పేషేంట్లతో బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ కేంద్రంలో ఒక్కో బాధితుడికి డయాలసిస్ చేయడానికి సుమారు 4 గంటల చొప్పున మిషన్లు పని చేస్తున్నాయి. ప్రైవేట్‌లో రక్తాన్ని శుద్ధి చేసే డయాలైజర్–2బీని దాదాపు పది సార్లు వాడుతున్న పరిస్థితి. ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో మాత్రం డయాలైజర్‌ను సింగిల్ యూజ్‌గా వినియోగిస్తున్నారు. ఇలా వాడకం వల్ల ఒకరి నుంచి మరొకరికి వైరస్ వ్యాప్తి చెందకుండా ఉంటుంది. పేదలకు వైద్యాన్ని అందుబాటులోకి తేవడంతో పాటుగా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచిత బస్ పాసులు, పింఛన్లు అందిస్తున్నారు.

ప్రయాణ భారం తగ్గింది



ఏళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న. గతంలో వరంగల్ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి డయాలసిస్ చేయించుకునేవాడిని. ఒకసారికి రూ.5వేలు ఖర్చు అయ్యేది. అదనంగా బస్ చార్జీలు, దూరాభారం ఉండేది. తర్వాత సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేయించుకున్నాను. ఇప్పుడు హుస్నాబాద్‌లో ఉచితంగా డయాలసిస్ చేయిస్తున్నారని ఇక్కడికి వస్తున్న. హుస్నాబాద్‌కు రావడం వల్ల దూరాభారం తప్పింది. ఇక్కడ వైద్య సిబ్బంది మంచిగనే చూసుకుంటాండ్లు.

–తిప్పని రాజయ్య, గట్ల మల్యాల

రోగుల సంఖ్య పెరుగుతోంది



హుస్నాబాద్ ఆస్పత్రికి డయాలసిస్ సెంటర్‌కు వస్తున్న బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. నిత్యం ఐదు నుంచి పది మందికి డయాలసిస్ చేస్తున్నాం. వైద్య నిపుణుల సూచనలకు అనుగుణంగా సేవలు అందిస్తున్నాం. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నాం. ఆరోగ్య స్థితిని బట్టి ఒక్కో రోగికి రెండు నుంచి నాలుగు గంటల పాటు డయాలసిస్ చేస్తున్నాం. పేదలు ఉచిత డయాలసిస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

–అనిల్, డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జి, హుస్నాబాద్

క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.8.15 లక్షలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని కొండ పోచమ్మ అమ్మవారి ఆలయంలో మూడు నెలల హుండీ ఆదాయం రూ.8,15,164 వచ్చినట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆలయంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీ డబ్బును లెక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చిన ఆదాయాన్ని ఆలయ బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఈ 23వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ శివకుమార్, సర్పంచ్ రజితారమేష్, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, లక్ష్మణ్, సుధాకర్, చిన్నా, హరి, చందు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేటలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎనిమిది మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా జడ్జి రమేశ్‌బాబు రూ.19 వేల జరిమానా విధించారు.

అంబేడ్కర్ ప్రతిమ ఏర్పాటు చేయాలి

గజ్వేల్‌రూరల్: గణతంత్ర దినోత్సవం నాడు జాతీయ జెండా ఎగురవేసే ప్రదేశంలో అంబేడ్కర్ ప్రతిమ పెట్టేలా ఆదేశాలు జారీచేయాలని డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ కలెక్టరేట్ కార్యాలయంలో ఏఓ రెహమాన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. గొప్ప రాజ్యాంగాన్ని రచించిన మేధావి అంబేడ్కర్ అని, ఆయన గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గణతంత్ర దినోత్సవం నాడు అంబేడ్కర్ ఫొటోలు పెట్టకుండా జెండా ఆవిష్కరణ చేయడం సరికాదని, జాతీయ జెండావిష్కరణ ప్రాంతంలో ప్రతీ ఒక్కరు అంబేడ్కర్ ప్రతిమను ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ చిత్రం ఆవిష్కరణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీఆర్ఎస్ ఆవిర్భావ సమావేశం సందర్భంగా జిల్లాకు చెందిన చిత్రకారుడు రుస్తుం బీఆర్ఎస్ చిత్రాన్ని బుధవారం తన ఆర్ట్ గ్యాలరీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావం కోసం కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని స్థాపించి విజయవంతం అయ్యారన్నారు. నేడు దేశ అభివృద్ధికి బీఆర్ఎస్‌గా మారిందని, కేసీఆర్ దేశ రాజకీయాల్లో రాణించడం తథ్యమన్నారు.

శనగకు పచ్చపురుగు బెడద

- పూత, కాత దశలో దెబ్బతింటున్న పంట
- దిగుబడిపై చూపనున్న ప్రభావం
- సకాలంలో సస్యరక్షణ చేపడితే ప్రయోజనం
- శాస్త్రవేత్త ఎన్.స్నేహలత


పచ్చపురుగు

జహీరాబాద్: జిల్లాలో యాసంగి కింద విస్తారంగా సాగులో ఉన్న శనగ పంటకు పచ్చపురుగు, రబ్బరు పురుగు ఆశించింది. ఇది రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం శనగ పంట పూత, కాత దశలో ఉంది. యాసంగిలో తేమ ఆధారంగానే శనగ పంటను పండిస్తారు. జిల్లాలో 20 వేల ఎకరాకు పైగా పంట సాగులో ఉంది. చీడపీడలు, తెగుళ్లను అరికట్టే విషయంలో నిర్లక్ష్యం చేస్తే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఈ సమయంలో శనగ పచ్చ పురుగు, రబ్బరు పురుగు దాడి ఉధృతమైతే పంటను కాపాడుకోవడం కష్టమవుతుందని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త ఎన్.స్నేహలత హెచ్చరిస్తున్నారు. సకాలంలో సస్యరక్షణ చేపట్టాలని చెబుతున్నారు.

శనగ పచ్చ పురుగు:

- ఇది పంట పండించే అన్ని ప్రాంతాల్లో కనిపిస్తుంది. ఎక్కువగా పూత, కాత దశలో ఆశిస్తుంది.
- ఈ రెక్కల పురుగు ఆకులు పూత, కాయపైన ఒకొక్క గుడ్డు పెడుతుంది. దాని నుంచి పొదిగిన లద్దె దశ లేత పసుపు రంగుగా మారుతుంది. పెరుగుతున్నకొద్దీ ఆకుపచ్చరంగు, గోధుమ పసుపు రంగుకు మారి గులాబీ రంగు చారలు కలిగి ఉంటుంది.
- పొదిగిన లద్దె దశలో (మొదటి దశ) ఆకులను తింటుంది. రెండో దశలో పూ మొగ్గలను తింటుంది. చివరి దశలో కాయలను తింటుంది.

రబ్బరు పురుగు

- పంట మొదట్లో ఆశిస్తుంది. రెక్కల పురుగు ఆకులమీద గుడ్లు పెట్టి వాటి మీద గోధుమ రంగు వెంట్రుకలతో కప్పి ఉంటాయి. వాటి నుంచి పొదిగిన లద్దె దశలో గుంపులాగా ఆకుల మీద, కాండం మీద ఉంటూ ఆకుల పత్ర హరితాన్ని గోకి తినడం వల్ల ఆకుల ఈనెలు మాత్రమే మిగులుతాయి.

యాజమాన్య పద్ధతులు

- ఈ పురుగుల ఉనికిని గుర్తించి ఎకరాకు ఐదు లింగాకర్షక బుట్టలు అక్కడక్కడ అమర్చుకోవాలి. అందులో కనుక 5 నుంచి 8 పురుగులు గమనించినట్లయితే పిచికారీ చేపట్టాలి.
- శనగలో అక్కడక్కడ బంతి, ఆముదం సాగుచేపడితే ఎర పంటలుగా పనిచేస్తుంది.
- పంటలో పేలాలు చల్లడంతో పాటు వై ఆకారంలో ఉన్న కట్టెలను పక్షులు వాలటానికి అక్కడక్కడ 10 వరకు అమర్చుకోవాలి. దీన్ని వల్ల లద్దె పురుగులను పక్షులు తింటాయి.
- పంట తొలి దశలో వేపనూనె 5 మిల్లీలీటర్లు లేదా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా 5 శాతం వేప గింజల కషాయం తయారు చేసుకుని పిచికారీ చేయాలి.
- ఆ తర్వాత ఎన్‌పీవీ (న్యూక్లియర్ పాలి హైడ్రోసిస్ వైరస్) వంద లార్వాలకు సరిపడేంత లేదా బీటీ (బాసిల్లస్ తురెంజెనసిస్) 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- అలాగే దశపర్ణి కషాయం 6 లీటర్లు, 200 లీటర్ల నీటికి కలిపి వారం మధ్యలో రెండు సార్లు పిచికారి చేయాలి.


శనగ కాయను తొలిచిన పురుగు


శనగ ఆకును ఆశించిన పచ్చపురుగు

ఎండు తెగుళ్లు:

- మొక్క చివరి నుంచి ఎండిపోతుంది. అలాగే వేర్లు చీల్చి చూస్తే గోధుమ రంగు లేదా నల్లగా కనబడుతుంది.

వేరుకుళ్లు తెగుళ్లు:

- పూత, కాత దశల్లో వ్యాపిస్తుంది. పంటలో నీరు నిల్వ ఉన్నప్పుడు, ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్నప్పుడు వస్తుంది. పూర్తిగా ఎండిపోయిన మొక్కను పీకితే వెంటనే ఊడి వస్తుంది. అలాగే వేర్లు నల్లగా అవుతాయి.

మొదళ్ల కుళ్లు తెగుళ్లు:

- మొక్క మొదట్లో మచ్చ ఏర్పడి, మొక్క పడిపోయి కుళ్లిపోతుంది. ఈ మొక్క పసుపు రంగులో మారి ఎండిపోతాయి. ఈ తెగుళ్లు ఎక్కువగా నీరు నిల్వ వలన, దుక్కిలో వేసుకున్న పెంటెరువులు సరిగ్గా కుళ్లకపోవడం వల్ల, ఉదజని సూచిక తక్కువ అయినప్పుడు, ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఆశిస్తాయి.

యాజమాన్య పద్ధతులు

- ఈ తెగుళ్ల వ్యాపింప చేసే సిలింద్రాలు 6 సంవత్సరాలుగా అలాగే నెలలో ఉంటాయి. జొన్న, మొక్కజొన్న లాంటి పంటలను వేసుకుని పంట మార్పిడి చేసుకోవాలి.
- వేసవిలో లోతు తక్కువ దుక్కులను చేసుకోవాలి.
- 200 కిలోల పేడలో లేదా ఎరువులో కిలో ట్రైకోడర్మా విరిడి కలిపి పక్షం రోజుల తర్వాత దుక్కిలో వేసుకున్నట్లయితే భూమిలో ఈ సీలింద్రాలని అరికట్టుకోవచ్చు.
- తెగుళ్ల సోకిన మొక్కలు ఎండిపోవడం గుర్తించి తీసి వేసి, దూరంగా పారవేయడం లేదా కాల్చివేయడం చేయాలి. మొక్క తీసిన చోట 10 గ్రాముల సూడోమోనాస్ లేదా ట్రైకోడర్మా విరిడి లీటరు నీటికి కలిపి మొదట్లో (డ్రెన్చింగ్) చేసుకోవాలి.

బురదలో కూరుకుపోయి వృద్ధుడి మృతి



జహీరాబాద్: బురదలో కూరుకుపోయి గుర్తు తెలియని వృద్ధుడి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చిరాగ్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడి ధరించిన ఆకుపచ్చషర్టుపై రాజు చిడ్‌గుప్ప టైలర్ మార్కు, ఎడమ చేతిపై పచ్చబొట్టుతో శిలువ గుర్తు ఉందన్నారు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రిలో భద్రపర్చామన్నారు. పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. వివరాలకు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ 8712656766 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ట్రాక్టర్ దగ్ధం



పాపన్నపేట(మెదక్): గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ దగ్ధం చేసిన సంఘటన మండల పరిధిలోని మిన్‌పూర్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్‌ఐ విజయ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రఘుపతిరాజు దుమ్ము చక్రాల ట్రాక్టర్‌ను గ్రామ శివారులోని ఓ పొలంలో ఉంచాడు. గుర్తు తెలియని ట్రాక్టర్‌ను తగులబెట్టారు. తెల్లవారు జామున అటుగా వెళ్లిన వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో బాధితుడు సంఘటనా స్థలానికి వెళ్లి కాలిపోయిన ట్రాక్టర్‌ను చూసి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్ తెలిపారు.

విద్యుత్ వైర్లలో గాలిపటం

తీసేందుకు యత్నం, విద్యుదాఘాతంతో బాలుడి మృతి


విద్యుత్ వైర్లను తగిలి మృతి చెందిన రిషి

జిన్నారం(పటాన్‌చెరు): గాలిపటం విద్యుత్ వైర్లకు చిక్కుకుంది. దానిని తీసేందుకు బాలుడు యత్నించటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో బుధవారం జరిగింది. సీఐ సురేందర్‌రెడ్డి, స్థానికుల కథనం ప్రకారం... కృష్ణా జిల్లా నందిగామకు చెందిన వీరబాబు-మాన్‌సాలమ్మ దంపతులు బొల్లారంలోని మల్లన బస్తీలో ఉంటున్నారు. వీరి కుమారుడు రిషి(12) స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. భవనంపైకి ఎక్కి గాలిపటం ఎగురవేస్తున్నాడు. అయితే గాలిపటుకు విద్యుత్ వైర్లలో చిక్కుకుంది. దానిని తీసేయత్నంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్న మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. బాలుడి మృత దేహాన్ని వారి స్వగ్రామానికి తరలించేందుకు బీజేపీ నేత ఆనంద్‌కృష్ణారెడ్డి అంబులెన్స్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

మద్యం మత్తులో విగ్రహాల తొలగింపు


ఆలయంలో చిందర వందరగా విగ్రహాలు


పోలీసుల అదుపులో వలస కూలీలు

శివ్వంపేట(నర్సాపూర్): మద్యం మత్తులో వలస కూలీలు ఆలయంలోని విగ్రహాలను తొలగించారు. ఈ సంఘటన మండల పరిధి చెండి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ శివారులో ఉన్న హరిదాస్ తండా ఫామ్‌హౌస్‌లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలువురు కూలీ పని చేస్తున్నారు. చెండి గ్రామంలో ఉన్న దుర్గమ్మ ఆలయంలోకి మంగళవారం అర్ధరాత్రి ఇద్దరు కూలీలు మద్యం మత్తులో ప్రవేశించి విగ్రహాలను తొలగించి అక్కడే నిద్రించారు. ఉదయం గమనించిన గ్రామస్తులు వారిని పట్టుకుని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని ఇరువురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 15 రోజుల క్రితం గ్రామంలోని చెండి కాంబ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు.

దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఆలయంలో విగ్రహాలను తొలగించిన కూలీలను విచారిస్తున్నట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓంప్రకాశ్‌గుప్తా, నేపాల్‌కు చెందిన రామ్ విశ్వకర్మగా గుర్తించినట్లు చెప్పారు. మద్యం మత్తులో దుర్గమ్మ ఆలయంలోకి ప్రవేశించి విగ్రహాలను తొలగించారన్నారు. వారు ఇంకా మద్యం మత్తులో ఉన్నారని, మత్తు దిగిన తర్వాత విచారణ చేపడతామని తెలిపారు.

విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయుడు

- తీవ్రంగా గాయపడటంతో తల్లిదండ్రుల ఆగ్రహం
- చర్యలు తీసుకుంటామన్న ఎంఈఓ

సిద్దిపేటరూరల్: విద్యార్థులను ఓ ఉపాధ్యాయుడు చితకబాదిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పుల్లూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన 5వ తరగతికి చెందిన ముగ్గురు విద్యార్థులు అశ్విత్, వైష్ణవి, ధనుష్ విరామం సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లి ఆలస్యంగా వచ్చారు. దీంతో ఆగ్రహం చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ కర్రతో కొట్టడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. విద్యార్థులు ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు తెలపడంతో వారికి చికిత్స చేయించారు. సాయంత్రం ఉపాధ్యాయులు వెళ్లిపోవడంతో గురువారం అడుగుతామని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు. ఈ విషయంపై హెచ్‌ఎం రాజనర్సయ్యను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. దీంతో ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డిని సంప్రదించగా ఉపాధ్యాయుడు కొట్టిన మాట వాస్తవమేనని గురువారం పాఠశాలకు వచ్చి వివరాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటానన్నారు.


విద్యార్థి చేతివేలుకు తీవ్ర గాయమైన దృశ్యం

దాడిచేసిన వారిని శిక్షించాలి

సిద్దిపేటరూరల్: అస్సాంలోని కరీంగంజ్ జిల్లా లోవిర్‌పురలో బజరంగ్‌దళ్ కార్యకర్తపై దాడి చేసి చంపిన జిహాదీ దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ మెదక్ విభాగ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓకు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ మెదక్ విభాగ్ సహ కార్యదర్శి రాజారాం మాట్లాడుతూ బజరంగ్‌దళ్ కార్యకర్తను నరికి చంపిన జిహాదీ దుండగులను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలన్నారు. రెండేళ్లలో తొమ్మిది మంది బజరంగ్‌దళ్ కార్యకర్తలను హత్య చేశారని, 32 మందిని గాయపరిచారన్నారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ కార్యకర్తలు నాగేందర్, శ్రీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.

మహిళకు కల్లు తాగించి బంగారం, వెండి చోరీ

పటాన్‌చెరుటౌన్: మహిళకు కల్లు తాగించి బంగారం, వెండిని గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం రామేశ్వరం మండ గ్రామానికి చెందిన గాలమ్మ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈనెల 13వ తేదీన గాలమ్మ మండల పరిధిలోని బచ్చు గూడెం నుంచి రామేశ్వరం బండకు నడుచుకుంటూ వెళ్తోంది. స్కూటీపై రామేశ్వరం బండ వైపు వెళ్తున్న ఇద్దరు కల్లు దుకాణం ఎక్కడుందని మహిళను అడిగి చూపించమని స్కూటీపై ఎక్కించుకొని వెళ్లారు. కల్లు తీసుకొని మహిళకు కూడా తాగించారు. ఆపై ఆమె మెడలో ఉన్న తులం బంగారం గుండ్లు, 25 తులాల వెండిని ఎత్తుకొని పరారయ్యారు. బాధితురాలు పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మహిళను స్కూటీపై తీసుకెళ్తున్న దృశ్యం

జర్నలిజం నేర ప్రేరేపితం కావద్దు

పోలీస్ కమిషనర్ శ్వేత


సీపీకి మొక్కను బహూకరిస్తున్న విద్యార్థులు

సిద్దిపేటఎడ్యుకేషన్: జర్నలిజం నేరప్రేరేపితం కాకుండా చూసుకోవాలని పోలీస్ కమిషనర్ శ్వేత సూచించారు. అలాగే జర్నలిస్టులు, పోలీసులు సత్సంబంధాలను కలిగి ఉంటే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంలోని ఓయూ పీజీ కళాశాలలో బుధవారం జర్నలిజం విద్యార్థులకు బేసిక్స్ ఆఫ్ క్రైమ్ రిపోర్టింగ్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టులు చట్టాలపై అవగాహన పెంచుకొని వార్తలు రాస్తే కేసుల విచారణలో పోలీసులకు ఇబ్బంది ఉండదన్నారు.

అలాగే నేరస్తులకు కోర్టులో శిక్షపడే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం టెక్నాలజీలో వచ్చిన వినూత్న మార్పులతో మీడియాలో వస్తున్న వార్తలను చూసి పలువురు నేరాలకు పాల్పడుతున్నారన్నారు. నేరవార్తలు అవసరమే అయినా అవి ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా ఉండాలన్నారు. కానీ చాలా సందర్భాల్లో ఇందుకు భిన్నంగా ఉంటుందన్నారు. జర్నలిజం చదివి ఎంతో మంది గొప్ప జర్నలిస్టులు అయి వారు రాసిన వార్తలతో ఎంతో మంది జీవితాల్లో వెలుగు నిండాయన్నారు. ఊహించుకుని వార్తలు రాయొద్దని నిజాలను స్పష్టంగా ప్రజలకు అర్థమయే విధంగా రాస్తే జర్నలిజంపై నమ్మకం పెరుగుందన్నారు. నేరవార్తల సేకరణ, పోలీసుల సహకారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై విద్యార్థులు సీపీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీకి విద్యార్థులు మొక్కను బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ రవినాథ్, జర్నలిజం విభాగాధిపతి రమేశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు చత్రపతియాదవ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

చీటీల మోసం కేసులో ..

- నలుగురికి ఏడాది జైలు, రూ.ఐదు వందల జరిమానా
- జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెల జైలు

పటాన్‌చెరు టౌన్: చీటీల పేరిట మోసం చేసిన కేసులో నలుగురికి ఏడాది జైలు శిక్ష, జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెల జైలు శిక్ష అనుభవించాలని జడ్జి శశిధర్ రెడ్డి తీర్పు ఇచ్చినట్లు సీఐ వేణుగోపాల్ రెడ్డి, కోర్టు పీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 2015 నవంబర్ 3వ తేదీన పటాన్‌చెరు మండలం ముత్తంగి డీఎస్ కాలనీకి చెందిన రామస్వామి, అతడి భార్య మాణెమ్మతో పాటు బావమరిది యేసు, యేసు భార్య లీల చీటీ వ్యాపారులు. చీటీలు పాడిన వారికి డబ్బులు ఇవ్వకుండా పరారయ్యారు. దీంతో ముత్తంగి గ్రామానికి చెందిన సందీప్ గౌడ్ అప్పట్లో బాధితుల కలసి ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ నవీన్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. బుధవారం నిందితులను సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా కోర్టు పీపీ శ్రీనివాస్ రెడ్డి వాదనలు విన్న న్యాయమూర్తి వారికి ఏడాది జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెల జైలు శిక్ష అనుభవించాలని తీర్పును ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

హామీ నెరవేర్చాలని గ్రామస్తుల ఆందోళన


గౌరయపల్లిలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): ఎన్నికల హామీ నెరవేర్చాలని గ్రామస్తులు బుధవారం ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గౌరయపల్లిలో సర్పంచ్ సద్దికృష్ణారెడ్డి గత సర్పంచ్ ఎన్నికల సమయంలో రెండెకరాల భూమి గ్రామానికి ఇస్తానని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఇప్పటి వరకు ఆ భూమి ఇవ్వడంలేదని ఆరోపించారు. రెండెకరాల భూమి గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పెళ్లయిన యువతులకూ పరిహారం చెల్లించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న యువతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతున్న భూ నిర్వాసితుల ఆడబిడ్డలు కొన్ని రోజులుగా దీక్ష శిబిరంలో నిరసన వ్యక్తం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పెళ్లయిన యువతులు వాపోయారు. బుధవారం పలువురు యువతులు విలేఖరులతో మాట్లాడుతూ 2010 నుంచి 2022లోపు పెళ్లయిన యువతులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా రూ.6 లక్షలు చెల్లిస్తామన్నారని తెలిపారు. అధికారులు విడుదల చేసిన జాబితాలో దాదాపు 120 మంది యువతుల పేర్లు వచ్చినా పెళ్లి అయిందనే సాకుతో పరిహారం ఇవ్వడం లేదని కన్నీటిపర్యంతమయ్యారు. తమ గోస ఈ ప్రభుత్వానికి తెలియడం లేదా? అంటూ ఆడబిడ్డల ఉసురు ప్రభుత్వానికి తగులుతోందని మండిపడ్డారు. గుడాటిపల్లి గ్రామానికి వెళ్లే దారి మూసివేత పనులు ఎలా చేపడతారో చూస్తామని వారు హెచ్చరించారు. న్యాయపరమైన పరిహారం ఇవ్వాలని అధికారులను అడిగితే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

పకడ్బందీగా 'కంటి వెలుగు' అమలు

తొగుట(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేయడానికి పకడ్బందీగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. తొగుట మండల కేంద్రంలో గురువారం ప్రారంభం కానున్న శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కంటి వైద్య నిపుణులచే వైద్య పరీక్షలు నిర్వహించేలా వైద్య సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, కార్యదర్శి శ్యామల, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలి


వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

సిద్దిపేటరూరల్: అత్యాచారాలకు గురైన ఎస్సీ, ఎస్టీ బాధితులకు ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం తక్షణ సహాయం, నష్టపరిహారం చెల్లించి, పునరావాసం కల్పించాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పి.శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి కవితకు బాధితులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడారు. జిల్లాలో దాదాపు 160 మందికి పైగా ఉన్న అత్యాచార బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఎఫ్ఐఆర్ నమోదు చెసిన ఏడు రోజుల్లో మొదటి విడత, చార్జి షీటు వేసిన తర్వాత రెండవ విడత నష్టపరిహారం చెల్లింపులో తీవ్ర జాప్యం చెయడం తగదన్నారు. ప్రతీ నెల చివరి వారంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మైస రాములు, డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.